## ధరణి లేకపోతే మళ్లీ కష్టాలు తప్పవు



కురవి : ధరణి పోర్టల్‌తో నిమిషాల్లోనే భూమి రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. సమైక్య పాలనలో ఎమ్మార్వో, సిబ్బందితో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. భూమిపై ఒకరు సాగు చేస్తే, రికార్డుల్లో మరొకరి పేరు ఉండేది. మూడు ఎకరాల భూమి ఉంటే రికార్డుల్లో రెండున్నర ఎకరాల భూమి ఉండేది. అదే సమయంలో సీఎం కేసీఆర్ రైతు బాంధవుడిగా వచ్చి ఆదుకున్నారు. ధరణి పోర్టల్ తేవడంతో ఇటువంటి అవకతవకలు లేవు. సీఎం కేసీఆర్ పుణ్యమాని ఆన్‌లైన్‌లో చూసుకుంటే భూమి తెలిసిపాయే. ఎవరెన్ని చెప్పినా కేసీఆర్ వెంటే రైతాంగం ఉంటుంది. ధరణి లేకపోతే మళ్లీ కష్టాలు కొనితెచ్చుకున్నట్లే. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ రైతులు కూలీలుగా వలస బాట పట్టాల్సిందే. రైతుబంధు పోయి రాబంధులవలే పీక్కుతింటరు.

*– షేక్ ఖాజామియా,రైతు, గాజతండా*

## మూడు గంటల కరెంట్‌తో ఎవుసం ఎట్ల జేస్తం



నర్సింహులపేట: మూడు గంటల కరెంట్ ఇస్తే ఎవుసం ఎట్ల జేస్తం. 50 ఏండ్లు కాంగ్రెసోళ్లు ఏలినప్పుడు ఎంత కరెంట్ ఇచ్చింండ్రు? కరెంట్ సక్కగా ఇస్తే మా బతుకులు గిట్ల ఎందుకు అయ్యేది. కాంగ్రెసోళ్ల వల్లే రైతుల చేతుల్లో పైసలు లేక బక్కపడ్డం. సీఎం కేసీఆర్ వచ్చినంకనే గీ పదేండ్ల నుంచి ఎవుసానికి, ఇండ్లకు 24 గంటల పాటు కరెంట్ వస్తాంది. ఎవుసం జేసుకుంటా జెర్ర రైతులు మంచిగైతుంటే గిప్పుడు కాంగ్రెసోళ్లు కరెంట్ కట్ జేసి 3 గంటలు ఇత్తమంటున్నారు. కాంగ్రెస్ గెలిస్తే రైతులకు 24 గంటల కరెంట్ ఇయ్యదు. రైతులు మంచిగా ఉంటే కాంగ్రెస్ నాయకులకు నచ్చదు. అన్ని విధాలుగా మంచిగా సూసే సీఎం కేసీఆర్ సారే మళ్లీ గెలవాలని దేవుడిని మొక్కుతున్నా.

*–ఊదరి యాకన్న, రైతు, పడమటిగూడెం*



# సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

### మున్సిపల్ చైర్మన్ వీరన్న, నాయకులు

డోర్నకల్, నవంబర్ 22: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి జరిగిందని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వీరన్న మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రణాళికా ప్రకారం తెలంగాణను అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామిగా నిలిపారని చెప్పారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే రెడ్యానాయక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు అఖిల్ ఉల్లా, రాజు, గణేశ్ ఠాగూర్, రాము పాల్గొన్నారు.



చిన్నగూడూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు

### *ఊరూరా ముమ్మర ప్రచారం*

దంతాలపల్లి: డోర్నకల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరం ప్రచారం చేశారు. బుధవారం మండలంలోని తూర్పుతండా, దుబ్బతండా, రేఖ్యతండా, మోఘ్యతండాలో రెడ్యానాయక్ కోడలు నిత్యమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు సతీమణి మంజుల, మరిపెడ ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ శారద ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తండాలో ప్రతి ఇంటికి వెళ్లి బొట్టుపెట్టి కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రెడ్యాతోనే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో మరిపెడ మాజీ ఎంపీపీ రాణి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గిర్వాణి, జిల్లా నాయకులు నూకల గౌతమ్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



డోర్నకల్: 15వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ వీరన్న, నాయకులు



దంతాలపల్లి: తూర్పుతండాలో ప్రచారం చేస్తున్న నిత్యమ్మ, నాయకులు

### *చిన్నగూడూరులో గడప గడపకూ వెళ్లి..*

చిన్నగూడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. చిన్నగూడూరులోని ఆయా కాలనీల్లో ముస్లిం నాయకులు ప్రచారం చేశారు. మండల నాయకులు లతీప్, కోఆప్షన్ సభ్యులు మూసిన్‌బేగ్ మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అబీబుద్దీన్, ఆదాం, హుస్సేన్, నాగుల్ మీరా, ఖాదర్, యాకూబ్‌పాషా, అఫ్రోజ్, యాకూబ్ జానీ, రహీం, ఎస్ పాషా పాల్గొన్నారు.



మ్యానిఫెస్టో పత్రాలు పంచుతున్న దామోదర్‌రెడ్డి, సర్పంచ్ రజితారెడ్డి

## బీఆర్ఎస్‌తోనే పేదల జీవితాల్లో వెలుగులు

నర్సింహులపేట, నవంబర్ 22: బీఆర్ఎస్ పార్టీతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, పార్టీ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంతోపాటు పెద్దనాగారం స్టేజీ గ్రామ పంచాయతీ, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ గెలిస్తే మరిన్ని పథకాలు అందుతాయని, రైతు సంక్షేమం కోసం గతంలో ఏ ప్రభుత్వం పని చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో నిరుపేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని, కేసీఆర్ తండాలను పంచాయతీలుగా చేసి పాలనను చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాల్సానీ దామోదర్‌రెడ్డి, రజితారెడ్డి, రమేశ్, జగదీశ్వర్, లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి, జైపాల్, సోమయ్య, శ్రీను, రవి, రవిబాబు పాల్గొన్నారు.



పెద్దనాగారం స్టేజీ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

## 'రెడ్యా'ను భారీ మెజార్టీతో గెలిపించాలి

కురవి(సీరోలు): కురవి, సీరోలు మండలాల్లోని గ్రామగ్రామాన బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం కొనసాగుతున్నది. సీరోలు మండలంలోని ఉప్పరిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచ్ తిరుపతిరెడ్డి, రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ సముద్రాల శ్రీనివాస్, సోషల్ మీడియా మండల కన్వీనర్ పేర్ల గణేశ్, ఉప సర్పంచ్ తోట రమేశ్, మంగమ్మ, కొప్పెర వెంకన్న, ఎల్ వెంకన్న పాల్గొన్నారు.



ఉప్పరిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## మద్యం బాటిళ్లు సీజ్

దంతాలపల్లి, నవంబర్ 22: మండలంలోని రేపోణి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్‌బాబు మాట్లాడుతూ.. గ్రామంలో బెల్టు షాపులపై దాడులు చేశామని, ఉమేశ్ ఇంట్లో నిల్వ ఉంచిన రూ.10వేల విలువగల మద్యం బాటిళ్లను గుర్తించి సీజ్ చేశామన్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్

నర్సింహులపేట, నవంబర్ 22: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. 11 మంది విద్యార్థులు నామినేషన్ వేయగా, ఒకరిది స్క్రూట్నీలో తొలగించారు. ముగ్గురు విద్యార్థులు నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఏడుగురు అభ్యర్థులకు గుర్తులు కేటాంచారు. 85 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనందబాబు మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యాకన్న, యాకూబ్, లక్ష్మీప్రసన్న, రవి, ఫణికుమార్ నర్సయ్యచారి, మోహన్‌రావు, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థులు

## రైలు నుంచి జారిపడి మహిళ మృతి

డోర్నకల్, నవంబర్ 22: గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి మహిళ మృతి చెందిన ఘటన డోర్నకల్–గార్ల రైల్వే స్టేషన్ మధ్యలో దిగువ లైనులో బుధవారం జరిగింది. జీఆర్పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్– గార్ల రైల్వే స్టేషన్ దిగువ లైను నంబర్ 456/34–36 కిలోమీటర్ రైలు నుంచి వెస్ట్ గోదావరి, అకివీడు గ్రామానికి చెందిన మాసపు మాణిక్యం (70) ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందింది.మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, ఖమ్మం అన్నం ఫౌండేషన్ సమాయంతో ఏరియా దవాఖానకు తరలించారని, మర్చురీలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు తెలిపారు. కరెంట్ బిల్లు ఆధారంగా మృతురాలి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

డోర్నకల్, నవంబర్ 22: ఓటు హక్కు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం డోర్నకల్‌లో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషన్ మాట్లాడుతూ.. ఓటు హక్కును అర్హులందరూ వినియోగించుకోవాలని సూచించారు. వంద శాతం ఓటింగ్ పాల్గొని, ఎన్నికలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ అహ్మద్, జూనియర్ అసిస్టెంట్స్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### *దంతాలపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలు*

దంతాలపల్లి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరుతూ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అందమైన ముగ్గులు వేశారు. వాటిని పరిశీలించి బహుమతులు అందజేశారు. ఎంపీడీవో విజయలక్ష్మి, శాఖల అధికారులు పాల్గొన్నారు.




డోర్నకల్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ అలీ